నిర్లక్ష్యపు నీడలో కఠోరా హౌజ్

- దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని తటాకం
- గుర్రపుడెక్క, వ్యర్థాలతో కంపుకొడుతున్న వైనం
- వృద్ధి చెందుతున్న దోమలు
- పట్టించుకోని అధికారులు



కఠోరాహౌజ్‌లో విస్తరించిన గుర్రపు డెక్క



కఠోరాహౌజ్‌లో మట్టి డంపింగ్

గోల్కొండ: అధికారుల నిర్లక్ష్యంతో చారిత్రక ప్రదేశాలు, కట్టడాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. గోల్కొండ కోట సమీపంలోని కఠోరాహౌజ్ పరిస్థితి కూడా అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఈ తటాకం వ్యర్థాల డంపింగ్ కేంద్రంగా మారింది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. చెత్త ఏరే రిక్షా కార్మికులు, కఠోరా హౌజ్ సమీపంలో ఉండే వారు తమ చెత్తను పట్టపగలే మూటలు కట్టి కఠోరా హౌజ్‌లో వేస్తున్నారు. ఇదే అదునుగా కొందరు మట్టి, కూల్చిన భవనాల శిథిలాలను లారీలు, టిప్పర్‌లలో తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వ్యర్థాల డంపింగ్..

కేవలం వర్షాకాలంలో మాత్రమే కఠోరా హౌజ్‌లో నీరు నిల్వ ఉంటుంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు కఠోరా హౌజ్‌లో వచ్చి చేరుతుంది. దీంతో కఠోరా హౌజ్‌లో పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్క విపరీతంగా పెరుగుతుంది. వర్షాకాలం అయిపోగానే నీరు తగ్గడం, ఉన్న నీరు మురికినీరుగా మారుతుంది. కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ వారు అడపదడపా తమ సిబ్బందిని కఠోరా హౌజ్ పరిశీలనకు పంపుతున్నారే తప్ప వ్యర్థాల డంపింగ్‌ను నిరోధించడానికి చర్యలు తీసుకోవడం లేదు. కఠోరా హౌజ్ చుట్టూ వేసిన ఫెన్సింగ్ ఎప్పుడో ధ్వంసమైంది. కఠోరాహౌజ్ వెళ్లడానికి ఉన్న ప్రధాన ద్వారం దశాబ్దాల క్రితమే కూలిపోయింది. ఏదేమైనా చారిత్రక ప్రదేశాలు అధికారుల నిర్లక్ష్యానికి బలవుతున్నాయి.

అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు..



విధి నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. భావితరాల కోసం చారిత్రక ప్రదేశాలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. శతాబ్దాల చరిత్రగల కఠోరాహౌజ్ మురికి కుంటగా మారడం ముమ్మాటికి అధికారుల నిర్లక్ష్యమే కారణం. – షేక్ మజహర్, ఇబ్రహీంబాగ్

పర్యాటక ప్రాంతంగా మార్చాలి..



కఠోరాహౌజ్‌ను పర్యాటక ప్రాంతంగా మార్చాలి. కఠోరాహౌజ్‌లోని పూడికతీతలను పూర్తిగా నిర్మూలించాలి. స్వచ్ఛమైన నీటితో నింపి కఠోరాహౌజ్‌లో బోటింగ్ సౌకర్యం కల్పించి ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలి.
– మిర్జా ఎక్బాల్ అహ్మద్, న్యాయవాది సమత కాలనీ

చేప ప్రసాదంతో ఆరోగ్యకర జీవితం



చేపప్రసాదం పంపిణీ చేస్తున్న దృశ్యం

అబిడ్స్: చేపప్రసాదంతో ఆరోగ్యకర జీవితం పొందుతారని రామకృష్ణ గౌడ్, అమర్నాథ్ గౌడ్, శివగౌడ్, గౌరీశంకర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం రెండో రోజు పెద్ద ఎత్తున చేపప్రసాద పంపిణీ చేపట్టారు. ప్రతి సంవత్సరం చేప ప్రసాదం పంపిణీ చేస్తూ ఆస్తమా రోగులకు ఉజ్వల ఆరోగ్యం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పప్పు మాత్రే తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి



గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ అన్నారు. హైదరాబాద్ పోలో రైడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న మాన్‌టెస్ క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పోలో రైడింగ్ క్లబ్ అధ్యక్షుడు ఆర్.చైతన్యకుమార్, ఉపాధ్యక్షుడు విజయేందర్ సింగ్, కార్యదర్శి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సురేందర్‌కు సత్కారం



నాంపల్లి: తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్‌ను గౌడ సంఘం సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గౌడ సంఘం అధ్యక్షుడు నరేష్‌గౌడ్ నేతృత్వంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి నవీన్ గౌడ్, సలహాదారులు భాస్కర్ గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన రాజువస్తాద్



సీపీ అవినాష్ మహంతితో రాజువస్తాద్

గోల్కొండ: నేరగాళ్లు తెలంగాణ పోలీసులంటేనే హడలెత్తిపోతున్నారని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోల్కొండ పీస్ కమిటీ చైర్మన్ ఎస్.రాజువస్తాద్ సోమవారం ఆయనను సీపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తాను నాలుగు దశాబ్దాలకు పైగా పీస్ అండ్ మైత్రి కమిటీలో పని చేస్తున్నానన్నారు. పీస్ కమిటీలలో యువత, వ్యాపారులు అధికంగా చేరుతున్నారని ఆయన కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా అవినాష్ మహంతి మాట్లాడుతూ..తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలులోకి వచ్చిన తర్వాత పోలీసింగ్‌లో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో బి.వెంకటేష్, షేక్ మజహర్, ఆనంద్ తదితరులున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య తదితరులు

అఫ్జల్‌గంజ్: ప్రజలకు 'ది హైదరాబాద్ సహకార కేంద్ర బ్యాంక్' ఆధ్వర్యంలో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తామని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య పేర్కొన్నారు. సోమవారం అబిడ్స్‌లోని 'ది హైదరాబాద్ సహకార కేంద్ర బ్యాంకు' ప్రధాన కార్యాలయంలో కొత్తకురమ్మ సత్తయ్య ఆధ్వర్యంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ప్రజలకు ఉత్తమ సేవలను అందించడంతో పాటు బ్యాంకులను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అంజిరెడ్డి, సతీష్, చంద్రశేఖర్, బాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కిషన్ నాయక్, లక్ష్మారెడ్డి, పోలీస్ రామిరెడ్డి, ఆనంద్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, మొగులయ్య, మోహన్ రావు, పీజీవి రాణి, గుగులోతు సైదా, బ్యాంక్ సీఈఓ భాస్కర సుబ్రమణ్యం, జీఎం ప్రభాకర్‌రెడ్డి, డీజీఎం కిరణ్, ఏజీఎం రమాదేవి, ప్రొఫెషనల్ డైరెక్టర్ గిరిధర్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలి



ఏఎస్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న బద్దం సతీష్‌గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని గ్రేటర్ హైదరాబాద్ డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ బద్దం సతీష్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం సివిల్ సప్లయ్ 4వ సర్కిల్ ఏఎస్‌ఓ పుష్పలతకు వినతిప్రం అందజేశారు. అనంతరం సతీష్‌గౌడ్ మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అర్హులైనవారందరికీ రేషన్‌కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరీఫ్, రాధాకృష్ణ, రియాజ్, మజిత్ పాల్గొన్నారు.

దళితులకు కాంగ్రెస్‌లో సముచిత స్థానం

గోల్కొండ: పేద బడుగు వర్గాలతో పాటు దళితులకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. సోమవారం కార్వాన్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ మిత్ర కృష్ణ కాంగ్రెస్ నాయకులతో కలిసి మంత్రిని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ..తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేద, బడుగు, బలహీన, మైనార్టీ జీవితాల్లో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఆయన ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మిత్ర అభిషేక్, పి.నర్సింగ్, ఉమేష్ తదితరులున్నారు.



లక్ష్మణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మిత్ర కృష్ణ

మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌గా గాజుల అంజయ్య



చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌గా గాజుల అంజయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ..ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో మీరాలంమండికి ప్రత్యేకత ఉందన్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించిన అనంతరం మరుసటి రోజు నిర్వహించే సామూహిక ఘటాల పరిసమాప్తి ఊరేగింపులో తమ ఆలయానికి చెందిన శకటాలు హైలెట్‌గా ఉంటాయన్నారు. ప్రతి ఏడాది ఆషాఢమాసం బోనాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.

బాక్సింగ్‌లో సత్తా



పతకాలు సాధించిన భానుతేజ, సుక్షిత

గోల్కొండ: ఇటీవల చెన్నైలో జరిగిన జాతీయ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో షేక్‌పేట్ బాక్సర్లు సత్తాచాటారని బాక్సింగ్ కోచ్‌లు వి.విఘ్నేష్‌బాబు, జి.శివకుమార్‌లు తెలిపారు. జూనియర్ బాక్సింగ్‌లో షేక్‌పేట్‌కు చెందిన పి.భానుతేజ రజత పతకం, సి.సుక్షిత కాంస్య పతకం సాధించినట్లు వారు తెలిపారు. సోమవారం వారిని షేక్‌పేట్ బాక్సింగ్ క్లబ్‌లో ఘనంగా సన్మానించారు.

అమ్మవారికి పూజలు

యాకుత్‌పురా: రానున్న ఆషాఢ బోనాలను పురస్కరించుకొన్ని జోగిని నిషాక్రాంతి అక్కన్న మాదన్న మహంకాళి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జోగినిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాతబస్తీ ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు జి.రాఘవేందర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు, ప్రభాకర్, ఆలయ కమిటీ ప్రతినిధులు రాందేవ్ అగర్వాల్, జగ్మోహన్ కపూర్, సతీష్, క్రాంతికుమార్, వినోద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పూజల్లో జోగిని నిషాక్రాంతి, రాఘవేందర్

శిథిలావస్థలో పోలీస్ ఔట్‌పోస్ట్



పురాతన కేసరి హనుమాన్ పోలీస్ ఔట్‌పోస్ట్

జియాగూడ: కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసరి హనుమాన్ పోలీస్ ఔట్‌పోస్ట్ శిథిలావస్థకు చేరింది. పురాతన కట్టడం అయిన ఈ ఔట్‌పోస్ట్ జాతీయ రహదారిలో కేసరి హనుమాన్ ఆలయం వద్ద ఉంది. గతంలో మరమ్మతులు చేసి ఔట్‌పోస్ట్‌ను వాడుకలోకి తీసుకొచ్చినప్పటికీ తిరిగి మూసివేయడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఔట్‌పోస్ట్‌ను కూల్చి దాని స్థలంలోనే నూతనంగా ఔట్‌పోస్ట్ బిల్డింగ్‌ను నిర్మించి అందుబాటులోకి తేవాలని స్థానిక బాంజవాడి, నవోదయ గంగానగర్, కేసరినగర్, కార్వాన్ సాహుకారి ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



లంగర్‌హౌస్: అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని లంగర్‌హౌస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శీనయ్య తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్ తపోవనం పార్కు వద్ద దాదాపు 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలించగా మృతిచెంది ఉన్నాడు. క్లూస్ టీం వచ్చి మృతదేహంతో పాటు అక్కడ ప్రాంతాలను పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన చేప ప్రసాదం పంపిణీ

గన్‌ఫౌండ్రీ: ప్రతి యేటా మృగశిర కార్తె సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, బత్తిని కుటుంబం ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన చేపప్రసాదం పంపిణీ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. గత రెండు రోజులుగా జరుగుతున్న చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో మత్స్యశాఖ తరఫున 59,231 వేల చేప పిల్లలను ఆస్తమా రోగులకు అందజేశారు. రెండవ రోజు అయిన సోమవారం ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా అమెరికా నుంచి సైతం పలువురు ప్రతినిధులు హాజరై చేపప్రసాదాన్ని స్వీకరించారు. ఆదివారం ఉదయం ప్రారంభమైన చేపప్రసాద పంపిణీ సోమవారం రాత్రి వరకు కొనసాగింది. ఆస్తమా రోగులు, సహాయకులకు పలు స్వచ్ఛంద సంస్థలు భోజన సదుపాయాలను కల్పించారు.

ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకలు



ఈద్ మిలాప్‌లో అలీ మస్కతి, ఖాలెద్ మస్కతి తదితరులు

చార్మినార్: పాతబస్తీలో ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకలు నిలుస్తాయని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అలీ మస్కతి అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని సోమవారం రాత్రి మస్కతి డైరీ ప్రొడక్ట్స్ ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ పార్టీ జరిగింది. చార్మినార్ సమీపంలోని కోట్లా అలీజాలో జరిగిన ఈ ఈద్ మిలాప్ కార్యక్రమంలో పలువురు పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిజాం కాలం నుంచి పాతబస్తీలో ఇరు వర్గాల ప్రజల ఉత్సవాలు కలిసిమెలిసి నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కుల, మతాలకతీతంగా పాతబస్తీలో పండుగలు, ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మస్కతి డైరీ ప్రొడక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్లు ఇర్ఫాన్ మస్కతి, సుల్తాన్ మస్కతి, ఖాలేద్ మస్కతి, ఆదిల్ మస్కతి, మన్నాన్ మస్కతి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను తరలించండి



జియాగూడ డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్త, జీవాలా వ్యర్థాలు

జియాగూడ: జియాగూడ చెత్త డంపింగ్ యార్డు తీవ్ర దుర్గంధంగా మారింది. బక్రీద్ సందర్భంగా లక్షలాది పొట్టేళ్లు, మేకలు, గోవుల, బీఫ్‌కు సంబంధించిన వ్యర్థాలు నగరంలో పలు చోట్ల చెత్తకుప్పల మధ్య పడేయగా జీహెచ్‌ఎంసీ లారీలు, స్వచ్ఛ ఆటోల్లో సిబ్బంది జియాగూడ డంపింగ్ యార్డులో డంప్ చేసింది. ఒకేసారి వందల లారీలు ట్రక్కులలో చెత్తతో పాటు జీవాల కళేబరాలు, వ్యర్థాలు కూడా చెత్తతో పాటు పేరుకుపోయింది. దీంతో రెండు రోజులుగా పేరుకుపోయిన చెత్త వ్యర్థాలను తరలించకపోవడంతో దుర్గంధం జియాగూడ, కార్వాన్ బస్తీల్లో వ్యాపించాయి. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఏఎంఓహెచ్ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని పలు బస్తీల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

వరద నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: వరద నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. రెయిన్‌బజార్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా జరుగుతున్న నాలా విస్తరణ, డ్రైనేజీ పైపులైన్ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. ఈ పర్యటనలో జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఐపీఈ–సిటీ కాలేజీ మధ్య విద్యా సహకార ఒప్పందం



ఒప్పందం పత్రాలతో ప్రొఫెసర్లు

చార్మినార్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ)–ఓయూ క్యాంపస్, సిటీ కాలేజీ (అటానమస్) సోమవారం విద్యాపరమైన అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం మూడేళ్ల పాటు అమలులో ఉంటుంది. ఈ ఒప్పందంపై ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. శ్రీనివాస మూర్తి, ఐపీఈ పీజీడీఎం ప్రోగ్రామ్ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ యలమంచిలి, సిటీ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డా.పి.శాంతి, వాణిజ్య విభాగ అధిపతి మల్లికార్జున రావు, అధ్యాపకులు ఝాన్సీరాణి, ఇఫ్ఫత్ ఉన్నిసా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ..ఈ ఒప్పందం విద్యా సంస్థలు, వ్యాపార ప్రపంచం మధ్య ఒక ఆచరణాత్మక వంతెనలా పని చేస్తుందన్నారు. డా.పి.శాంతి మాట్లాడుతూ.. ఐపీఈ సంస్థ విలువైన వనరులు సిటీ కాలేజ్ అనుభవంతో కలవడం వల్ల విద్యార్థులకు పరిశోధన, ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు మరింత విస్తృతమవుతాయన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే కౌసర్‌కు ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోటలో జరిగే బోనాల ఉత్సవాలకు సహకరిస్తానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఈ నెల 26న తాము చేపట్టిన జూలుస్‌కు రావాల్సిందిగా కోరుతూ గోల్కొండ జగదాంబిక మహంకాళి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి ఆయనకు సోమవారం ఆహ్వానపత్రం అందజేశారు. తాము ప్రతియేటా రిసాల బజార్ నుంచి జూలుస్ నిర్వహిస్తున్నామని దీనిని విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..బోనాల ఏర్పాట్లపై తాను పోలీసు అధికారులతో పాటు దేవాదాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తానన్నారు. శ్రీకాంత్, సురేష్‌చారి తదితరులున్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

చార్మినార్: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ జాయింట్ కమిషనర్ డి.శంకర్ సింగ్ అన్నారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో చాంద్రాయణగుట్ట నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, మురుగునీటి సమస్య, రోడ్లు, వీధి దీపాలు ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ రాజారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



స్వప్న, స్నేహను అభినందిస్తున్న డాక్టర్ జయదీప్ ఆర్య

అబిడ్స్: యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని యోగాసన భారత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయదీప్ ఆర్య పేర్కొన్నారు. స్వప్న, స్నేహ జాతీయ జడ్జెస్ ట్రెనింగ్‌లో యోగాసన జడ్జీలుగా శిక్షణ పూర్తి చేయడంతో వారిని ఆయన ప్రశంసించారు. అనంతరం మాట్లాడుతూ..యోగాకు మంచి భవిష్యత్తు ఉందని స్వప్న, స్నేహ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యకర జీవితం పొందాలన్నారు. పంజాబ్‌లో జరిగిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ సెంటర్‌లో నేషనల్ జడ్జెస్ ట్రెనింగ్‌లో స్వప్న, స్నేహలు విజయవంతంగా శిక్షణ పూర్తిచేయడం అభినందనీయమన్నారు.

దత్తాత్రేయకు సన్మానం

చార్మినార్: ప్రజల కథే..నా ఆత్మకథ అనే టైటిల్‌తో బండారు దత్తాత్రేయ రాసిన ఆయన ఆత్మకథ పుస్తకంలో 70 ఏళ్ల బహుళ రంగాల అనుభవాలను వివరిస్తుందని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రి అన్నారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ రచించిన పుస్తకావిష్కరణ అనంతరం సోమవారం ఆయన ఇంటికి వెళ్లి సన్మానించామన్నారు. రాజకీయాల్లో ఉన్నప్పటికీ నిస్వార్థంగా ప్రజాసేవకే ఆయన జీవితం అంకితమైందన్నారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించారన్నారు. మమ్మద్ అబ్దుల్ సత్తార్ తదితరులు ఉన్నారు.



దత్తాత్రేయను సన్మానిస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రి

అలరించిన కూచిపూడి నృత్యోత్సవం



కళాకారులతో నాట్యగురువు పసుమర్తి శేషుబాబు తదితరులు

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి శాస్త్రీయ సంగీత నృత్యాలపై మక్కువ కల్పించాలని ప్రముఖ నాట్య గురువు డాక్టర్ పసుమర్తి శేషుబాబు అన్నారు. రవళి ఆర్ట్స్ అకాడమీ కూచిపూడి నృత్య శిక్షణాలయం ఆధ్వర్యంలో సోమవారం కళా ప్రాంగణంలో కూచిపూడి నృత్యోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్య దర్శకులు రవళి రాంబాబు ఆధ్వర్యంలో గంగా–గౌరీ సంవాదం పేరిట సాగిన నృత్యరూపకం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు శాస్త్రీయ సంగీత కళలపై శిక్షణ ఇవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, రంగస్థల నటుడు బాల గంగాధరరావు, అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి రవళి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి నవ్యశ్రీ సందీప్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి




గాయనీ గాయకులతో సినీ దర్శకులు ఖాజా పాషా, రమేష్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: జనరంజని సాంస్కృతిక సంస్థ 3వ వార్షికోత్సవాన్ని సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..సంగీతం మనసుకు ఉల్లాసాన్ని కలిగిస్తుందన్నారు. ఔత్సాహిక గాయనీ గాయకుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఇటువంటి సంస్థలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. గాయకురాలు అరుణకుమారి అధ్యక్షతన జరిగిన సంగీత విభావరిఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు సామల రమేష్, ఖాజా పాషా, గేయ రచయిత వరికుప్పల యాదగిరి, నిర్వాహకురాలు అరుణ పాల్గొన్నారు.

శానిటేషన్ డ్రైవ్ విజయవంతం

గోల్కొండ: బక్రీద్ సందర్భంగా తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చేపట్టిన బక్రీద్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ విజయవంతం అయ్యిందని ఆర్గనైజేషన్ కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహాద్ అన్నారు. ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ తదితరులు సోమవారం ఆయనను టోలిచౌకిలోని టీఎఫ్‌సీఓ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా మహ్మద్ ఫహాద్ మాట్లాడుతూ..తమ ఆర్గనైజేషన్ సభ్యులు, పీస్ ఫోర్స్ సొసైటీ సభ్యులు, కార్యకర్తలు టోలిచౌకి, గోల్కొండ, నానల్‌నగర్ తదితర ప్రాంతాల్లోని డంపింగ్ యార్డుల వద్ద బక్రీద్ వ్యర్థాలను డంప్ చేసే వారికి చెత్త బ్యాగులు అందించారన్నారు. అదే విధంగా వ్యర్థాలను రోడ్లపై డంప్ చేయకుండా డంపింగ్ యార్డులోని చెత్త డబ్బాలలోనే వేసేలా ప్రజలను కోరడం జరిగిందన్నారు. మహ్మద్ నజీబ్, బాలకిషన్, మహ్మద్ రహుఫ్, ఏజాజ్ తదితరులున్నారు.

మంత్రికి శుభాకాంక్షలు



చాంద్రాయణగుట్ట: తెలంగాణ రాష్ట్ర మంత్రిగా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వాకిటి శ్రీహరి ముదిరాజ్‌ను కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. టీపీసీసీ కార్యదర్శి బి.వెంకటేష్ ముదిరాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సంజీవ్ ముదిరాజ్ తదితరులు ఆయనను సన్మానించారు.